క్లుప్తంగా

మండల వైఎస్సార్‌సీపీ సమావేశం నేడు

పొన్నూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో వైయస్సార్ సీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి సమావేశం జరుగుతుందని తెలిపారు. వివిధ కమిటీల పునఃనిర్మాణం కోసం నాయకుల అభిప్రాయాలను సేకరించి అధిష్టానానికి పంపించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ పార్టీ పదవుల్లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



పొన్నూరు: వాహన చోదకులు పోలీసు నిబంధనలు తప్పక పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని పట్టణ సీఐ వీరానాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇష్టానుసారంగా నంబర్ ప్లేట్లు రాయించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, వాహనాల డాక్యుమెంట్స్ సరిగా లేని వారికి జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మైనార్టీ తీరకుండా పిల్లలకి వాహనాలు ఇవ్వరాదని, నిబంధనలు పాటించకుంటే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జీవవైవిధ్యంతో జన జీవన భద్రత



కాకుమాను: భూమిపై మానవ మనుగడ సక్రమంగా సాగాలంటే జీవవైవిధ్యం బాగుండాలని.. దాని ద్వారానే జన జీవన భద్రత, సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవం సందర్భంగా పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవాళి సహా ప్రకృతిలోని జీవరాశులన్నీ జీవవైవిధ్యం పరిధిలోకి వస్తాయని అన్నారు. ప్రకృతి సమతుల్యతతో పాటు ఆహార భద్రత, పేదరిక నిర్మూలన, సుస్థిర జీవనోపాధులు వంటివి జీవవైవిధ్యంతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన భాద్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, గారపాటి రమేష్, శివయ్య, ప్రసాదరావు, వీరాస్వామి, రవి పాల్గొన్నారు.

ప్రతి డ్వాక్రా మహిళ వ్యాపారవేత్త కావాలి

పెదకాకాని: ప్రభుత్వ సంకల్పం మేరకు ప్రతి డ్వాక్రా మహిళ వ్యాపారవేత్త కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయలక్ష్మి అన్నారు. పెదకాకాని గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలతో ఆమె మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరుణ వాకాటి ఆదేశాల మేరకు రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల అభివృద్ధికి ఖర్చుల ప్రణాళికలను రూపొందించామన్నారు. మండల, గ్రామ స్థాయిలలో డ్వాక్రా వ్యాపారవేత్తలను గుర్తించి వారికి కావాల్సిన నిధులను బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ఇతర శాఖల సమన్వయంతో అందించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎం రాజు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

మోదీ అధికారంలో దేశం తిరోగమనం



ఆత్మకూరు(మంగళగిరి): నరేంద్ర మోదీ అధికారం చేపట్టాక దేశం తిరోగమనంలో నడుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. గురువారం నగర పరిధిలోని ఆత్మకూరులో సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ విధానాలతో దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికల హామీలను విస్మరించారని మండిపడ్డారు. నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జలాది జాన్‌బాబు, మేడా హనుమంతరావు, పంతగాని మరియదాసు పాల్గొన్నారు.

నిర్మాణ గదులకు మోక్షమెప్పుడు!



వెల్లలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్తికాని అదనపు తరగతి గదులు

- నిలిచిన 'మన బడి మన భవిష్యత్తు' నిర్మాణాలు
- 2025-26 విద్యా సంవత్సరంలోనూ అందుబాటులోకి రాని అదనపు తరగతి గదులు



అసంపూర్తిగా నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాల

పొన్నూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అందులో భాగంగా మనబడి 'నాడు-నేడు' పథకం పేరుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించింది. కార్పొరేటుకు ధీటుగా భవనాలను నిర్మించింది. అయితే మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చివరి దశలో నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ప్రభుత్వ పాఠశాలల పురోగతిని విస్మరిస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయడాన్ని గాలికొదిలేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా కనీసం వీటి వైపు అధికారులు, పాలకులు చూడడంలేదు. దీంతో చాలా భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కనీసం ఒక్క భవనాన్ని కూడా పూర్తి చేయలేదు.

అసంపూర్తిగా అదనపు గదుల నిర్మాణాలు..

నియోజకవర్గం కేంద్రమైన పొన్నూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన అనేక అదనపు తరగతుల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా జెడ్పీ ఉన్నత పాఠశాలల విషయానికొస్తే పట్టణంలోని 1, 5 వార్డులలోని మున్సిపల్ హైస్కూళ్లలో రూ.84 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు, రూ.61.46 లక్షలతో నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్, రూ.54.71 లక్షలతో బాలికల ఉన్నత పాఠశాల, రూ.43.14 లక్షలతో వెల్లలూరు, రూ.44 లక్షలతో పచ్చల తాడిపర్రు, రూ.63.25 లక్షలతో దొప్పలపూడి జెడ్పీ హైస్కూళ్లలోని భవన నిర్మాణాలు చివరి దశలో నిలిచిపోవడంతో ఇవన్నీ అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి.

విద్యార్థుల అవస్థలు..

మండల వ్యాప్తంగా సుమారు రూ.6.19 కోట్లతో 36 ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులను గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా నిర్మాణ పనులను చేపట్టింది. కూటమి పాలన వచ్చిన తర్వాత 'మన బడి మన భవిష్యత్తు' పథకంగా వీటికి పేరు మార్చారు. పనులు మాత్రం ముందుకు సాగక పడకేశాయి. ప్రభుత్వ తీరుతో చాలా పాఠశాలల్లో వసతి సమస్యలతో గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు అవస్థలు పడ్డారు. నిర్మాణాలను ఇప్పటికీ పూర్తిచేయకపోవడంతో వచ్చే విద్యా సంవత్సరంలోనూ ఇబ్బందులు తప్పేలా లేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు కూడా పూర్తికాలేదు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని రానున్న విద్యా సంవత్సరానికైనా భవన నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..

మండలంలో 'మన బడి మన భవిష్యత్తు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అదనపు తరగతుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఉన్నతాధికారుల సూచన మేరకు పాఠశాలల్లో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు సంబంధించి వివరాలను పంపించాం.

– రఘు చలపతిరావు, ఎంఈఓ 2, పొన్నూరు

మతం పేరుతో అనైక్యత సృష్టిస్తున్న బీజేపీ

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

లక్ష్మీపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతం పేరుతో అనైక్యతను సృష్టిస్తోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.నళినీకాంత్ అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని విమర్శించారు. మతోన్మాద బీజేపీని ఒంటరి చేసి ఓడించాలని, సీపీఎం అఖిల భారత మహాసభ పిలుపుకు అనుగుణంగా పార్టీని సమాయత్తం చేయాలని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీజేపీ విధానాలనే అమలు చేస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు నగరంలో భవిష్యత్ ప్రజా అవసరాల దృష్ట్యా శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. నగరంలో బృందావన్ గార్డెన్స్ వద్ద అసంపూర్తిగా ఉన్న నార్ల ఆడిటోరియాన్ని ప్రభుత్వ రంగంలోనే పూర్తి చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే మద్దతు ధరకు కొనగోలు చేయాలని కోరారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈ.అప్పారావు, ఎస్‌.భావన్నారాయణ, ఎం.రవి, బూరుగ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వి.జవహర్‌లాల్, బి.లక్ష్మణరావు, ఎం.ఎ.చిష్టీ, బి.సుధాకిరణ్, ఎల్.అరుణ, యు.దుర్గారావు పాల్గొన్నారు.

యనమదలలో ఏకపక్షంగా టీడీపీ గ్రామకమిటీ ఎన్నిక

అభ్యంతరం తెలిపిన టీడీపీలోని మరో వర్గం

ప్రత్తిపాడు: యనమదలలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక ఇష్టానుసారంగా, ఏకపక్షంగా నిర్వహించారని ఆ గ్రామంలోని కొందరు టీడీపీ నేతలు మండిపడ్డారు. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలో గురువారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు పార్టీలో ఆది నుంచి క్రియాశీలకంగా ఉన్న వారు, ఆశావహులు రాకముందే ఎన్నికను ముగించారు. ఆశావహులు వెళ్లి ఎన్నిక ఎప్పుడని ప్రశ్నించడంతో, ఇప్పటికే ఎన్నిక ముగిసిందని, గ్రామ కమిటీని కూడా ప్రకటించామని మండల పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నిక గురించి ముందస్తుగానే గ్రామంలోని పార్టీ శ్రేణులందరికీ సమాచారం ఇచ్చామని సదరు టీడీపీ నాయకులు తెలిపారు. దీంతో మరో వర్గం టీడీపీ నాయకులు, ఆశావహులు టీడీపీ మండల నాయకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అందరూ రాకముందే ఎన్నిక ఎలా నిర్వహిస్తారని ఘాటుగా ప్రశ్నించారు. ఒక పక్క చంద్రబాబు, లోకేష్ అందరినీ కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగాలని సూచిస్తున్నప్పటికీ.. మండల పార్టీ అధ్యక్షుడికి, నాయకులకు అవేమీ పట్టడం లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ఏకపక్ష ఎన్నికల వర్గపోరుకు బీజాలు వేస్తున్నాయని టీడీపీ నాయకులు పాలేటి మాదవరావుతో పాటు యడ్లపల్లి బుల్లియ్య, బొంతు సాంబశివరావు, సూరగాని చంద్రమౌళి, వెంకట్రావు, ఆలా గోపి, బైనబోయిన లింగారావు, బైనబోయిన సీతారామయ్య, మన్నవ కోటయ్య, తోడేటి శివయ్య, కటారి శ్రీనివాసరావు, విగ్రహాల మంగయ్యలు ఆరోపించారు.

ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమాకు అపూర్వ గౌరవం



మాట్లాడుతున్న దర్శకుడు దిలీప్‌రాజా

నగరంపాలెం: ఫ్రాన్స్ దేశంలో జరుగుతున్న 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా భారత చలన చిత్రం 'హోమ్ బౌండ్' తొమ్మిది నిమిషాల స్టాండింగ్ ఓవేషన్ గౌరవం దక్కించుకుని అరుదైన రికార్డ్‌ను సృష్టించిందని మా-ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా పేర్కొన్నారు. గుంటూరు రాజీవ్ గాంధీనగర్‌లోని బ్యాంక్ కాలనీలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరజ్ ఘయ్యాన్ దర్శకత్వంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్ నటించిన 'హోమ్ బౌండ్' సినిమా కేన్స్ అవార్డ్ కోసం ఎంపికైన తొలి భారతీయ సినిమా కావడం విశేషమని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవిత చరిత్ర ఆధారంగా నటుడు ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ది మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియా' బయోపిక్ టైటిల్ పోస్టర్‌ను కేన్స్‌లో విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రక్షణ కార్యక్రమాలకు అబ్దుల్ కలాం అందించిన సేవలను దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కిస్తున్నారని పేర్కొన్నారు. భారత సినిమా దిశ మార్చుకుని ప్రపంచ దృష్టిని ఆకర్షించే స్థాయికి రావడం భారతీయులు అందరూ గర్వించదగ్గ శుభపరిణామమని తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లకు పర్సంటేజీ చెల్లించాలనే డిమాండ్‌తో సినిమాల ప్రదర్శనలను నిలిపివేస్తున్నట్లుగా ఎగ్జిబిటర్లు ప్రకటించిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. సినిమా పెద్దలు ఈ సమస్యకు పరిష్కార మార్గం చూపాలని ఆయన కోరారు. లేనిపక్షంలో వచ్చే నెల ఐదున మణిరత్నం దర్శకత్వంలో అగ్రనటుడు కమల్‌హాసన్, త్రిష, శింబు నటించిన థగ్ లైఫ్, 12న హరిహర వీరమల్లు, 27న కన్నప్ప, 30న కుబేర, కింగ్‌డం వంటి పెద్ద చిత్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు.

నేడు పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ

నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ, ప్రార్థన సభ శుక్రవారం గుంటూరులోని ఎల్ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త, క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరబాబు వెల్లడించారు. ఎల్ఈఎం హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల హత్య విషయంలో ఉన్నత స్థాయి విచారణ, పాస్టర్లు, క్రైస్తవులు, చర్చిల రక్షణ కోసం ప్రత్యేక చట్టం, నగరం నలుమూలల క్రైస్తవుల సమాధుల తోటకు స్థలాలు మంజూరు చేయాలనే డిమాండ్లతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రైస్తవులు, పాస్టర్లు, బిషప్‌లు, దైవ సేవకులు వేలాదిగా కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. మద్దు ప్రేమజ్యోతిబాబు, పాస్టర్లు పి.సురేష్ జేమ్స్, పాస్టర్ బాబూరావు, మత్తయ్య, ఆనంద్, సంసోను, విజయబాబు, దీవెన రాజు, క్రైస్తవ ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌తో పాటు నులకపేట, డొల్లాస్ నగర్ ప్రాంతాలలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాజాతర బృందాలతో వీధి నాటకాలు, ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శాంత కుమారి, ఎల్‌టీ రాఘవేంద్ర, మారుతీ మహిళా సొసైటీ ప్రతినిధులు పి.గంగాభవాని, ఏఎన్ఎం ప్రత్యూష పాల్గొన్నారు.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం అంటూ భక్తులు అంజన్న పాదాలకు మోకరిల్లారు. గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో మారుతికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ప్రణవిల్లారు. ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని సేవించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణను నిర్వాహకులు చేశారు.



గొట్టిపాడులో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



అంజన్న సేవలో ఏఎస్పీ సరిత




కొత్తరెడ్డిపాలెంలోని ప్రసన్నాంజనేయుడు



చేబ్రోలులో వీరాంజనేయస్వామి



సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు



పొన్నూరులోని శ్రీ వీరాంజనేయస్వామి

ప్రత్తిపాడు: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పెదగొట్టిపాడులోని ఆంజనేయస్వామి దేవాలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులు, ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పోటీపడ్డారు. దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పాతమల్లాయపాలెంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి.

పెదకాకాని: మండలంలోని వై జంక్షన్ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి అభిషేకం, నాగవల్లీ పూజలు నిర్వహించారు. చందనంతో స్వామి వారిని అలంకరించారు. పెదకాకాని రెడ్డివారి బావి వద్ద ఉన్న అభయాంజనేయడికీ విశేష పూజలు జరిపారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలకు ఏఎస్పీ సరిత, గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ విజయలక్ష్మి హాజరైయ్యారు. ఆలయ నిర్వాహకులు అతిథులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం మహిళల కోలాట ప్రదర్శనలు, చిన్నారుల భరతనాట్యాల నడుమ కనుల విందుగా జరిగింది.

కాకుమాను: మండల కేంద్రం కాకుమానులోని 45 అడుగుల ఏరువాక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులు హనుమజ్జయంతిని నిర్వహించారు. ఆలయ దాత ఆరుమళ్ల రామారావు దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు.

చేబ్రోలు: చేబ్రోలు ఆదికేశవస్వామి దేవస్థానం ప్రాంగణంలోని దక్షిణముఖ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో సువర్చలా సమేత ప్రసన్నాంజనేయుడి కల్యాణోత్సవాన్ని అర్చక బృందం ఘనంగా నిర్వహించారు. స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేబ్రోలు బ్రహ్మ గుడి సమీపంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానం, కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్ గ్రౌండ్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, శలపాడు కోదండరామస్వామి దేవస్థానం, వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రసన్నాంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని వేజండ్ల, సుద్దపల్లి, వీరనాయకునిపాలెం, మంచాల గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఆయా చోట్ల ఘనంగా జరిపారు.

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం స్వామికి లక్ష తమలపాకులు, మల్లెపూలతో పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నివేదన, నీరాజనం, తీర్థప్రసాద వితరణ చేశారు. రాత్రి శ్రీ సువర్చలా సమేత వీరాంజనేయస్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి గద్దె వెంకట అమర్‌నాధ్ పర్యవేక్షించారు.

నండూరులో వేడుకలు..

శ్రీ ప్రపత్తాంజనేయస్వామి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన, హోమాలు నిర్వహించారు. సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేదస్వస్తి నిర్వహించారు. కార్యక్రమాలను హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ పర్యవేక్షించారు.

తొలి సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్



గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశంలో వేళ్లూనుకున్న మూఢ, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, భారత జాతి పునర్జీవానికి కృషి చేసిన తొలి సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్ అని విద్యావేత్త డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. బాలానంద కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో గురువారం రామ్మోహన్‌రాయ్ 253వ జయంతిని బ్రాడీపేటలోని రాజారామ్మోహన్ రాయ్ పాఠశాల ప్రార్థన సమాజం ఆవరణలో నిర్వహించారు. బాలానంద కేంద్ర కార్యదర్శి నడింపల్లి గురుదత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రామ్మోహన్ రాయ్ ఉన్నత విద్యావంతుడుగా, బహుభాషా కోవిదుడిగా హిందూ, క్రైస్తవ, ముస్లిం గ్రంథాలను ఔపోసన పట్టి ఏకేశ్వరోపాసన స్థాపన కోసం 'బ్రహ్మ సమాజం' ఏర్పాటు చేశారని వివరించారు. సతీ సహగమనాన్ని, బాల్య వివాహాలను అప్పటి బ్రిటిషు ప్రధాని విలియం బెంటింగ్ ద్వారా చట్టబద్ధంగా నిరోధించారని తెలిపారు. బాలానంద కేంద్రం గౌరవాధ్యక్షుడు కేతరాజు నరసింహారావు మాట్లాడుతూ సంస్కరణ వాదులైన రఘుపతి వెంకయ్య నాయుడు, అప్పటి మున్సిపల్ చైర్మన్ నడింపల్లి లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా రాజారాం మోహన్ రాయ్ పేరున బ్రహ్మ సమాజం అనబడే ప్రార్థన సమాజాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలానంద కేంద్ర ఉపాధ్యక్షులు మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, పి.ఎస్. మూర్తి, కె.రామ్ సుభాష్, మాజేటి వీఎస్ఆర్ ప్రసాద్, బాలానంద కేంద్ర పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి వావిలాల రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్ఓల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్ఓలు

లక్ష్మీపురం: కలెక్టరేట్ కార్యాలయం ఎదుట డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద సీహెచ్ఓల నిరసన గురువారం 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా ఏపీఎంసీఏ సెక్రటరీ లింగరాజు యాదవ్, ట్రెజరర్ కె.సంధ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తున్న తమకు న్యాయపరమైన హక్కులు, ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో సమ్మె కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈనెల 20న రాష్ట్ర కార్యవర్గంతో ఆరోగ్య శాఖ కమిషనర్, అధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యారని, అధికారులు స్పందించిన తీరు బాధాకరంగా ఉందని చెప్పారు. తమ సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ కొడాలి సృజన, రాధిక, నితిషా, విజయలక్ష్మి, కళ్యాణి, మణికంఠ పాల్గొన్నారు.

నిబంధనలకు తిలోదకాలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ మాయాజాలం సాగుతుంది. కొనుగోలు దారులను ఆకర్షించి ప్లాట్లు అంటగడుతున్న రియల్ ఎస్టేటర్లు ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు వదులుతున్నారు. బుధవారం నిండు వేసవిలో కురిసిన వర్షానికి తాడికొండ ప్రాంతంలో వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లు నీటమునిగి చెరువులను తలపించాయి. నిబంధనల ప్రకారం ప్లాట్లు వేయాలంటే సీఆర్డీయే అనుమతి తీసుకోవడంతో పాటు పక్కా రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి ట్యాప్‌లు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు 10 శాతం భూమిని సంబంధిత గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ ఇక్కడ మాత్రం యథా రాజా తథా ప్రజ అన్న చందంగా నిబంధనలను గాలికొదిలి యథేచ్ఛగా మోకాల లోతులో పంట పొలాల్లో అరకొర సౌకర్యాలు కల్పించి వెంచర్లు వేసి వాటిని అమ్మి భారీగా లబ్ది పొందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు తూట్లు పొడిచి ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్న అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.